క్లుప్తంగా

రాయితీలను సద్వినియోగించుకోవాలి



డ్రిప్ యూనిట్‌ను పరిశీలిస్తున్న పీడీ లక్ష్మీనారాయణ

చీపురుపల్లి: ప్రభుత్వం రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ పరికాలను అందజేస్తోందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని ఏపీ ఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ సూచించారు. మండలంలోని పేరిపి గ్రామంలో రైతు అన్నె సుజాత వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన డ్రిప్ ఇరిగేషన్ యూనిట్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సుజాతకు రూ.1,27,126 విలువైన డ్రిప్ పరిక రాలను ప్రభుత్వం రాయితీపై రూ.60,950కు అందజేసిందని చెప్పారు. డ్రిప్, స్పింకర్ల పరికరాలు కావాల్సిన రైతులు తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రారంభానికి సిద్ధం

- రూ.4 కోట్లతో పట్రువాడ బ్రిడ్జి నిర్మాణం



ప్రారంభానికి సిద్ధమైన బ్రిడ్జి

గజపతినగరం రూరల్: మండలంలోని పట్రువాడ గ్రామస్తుల సుదీర్ఘ స్వప్నాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాకారం చేసింది. గ్రామానికి సమీపంలోని చంపావతి నదిపై బ్రిడ్జి నిర్మాణం పూర్తికావడంతో తమకు ప్రయాణ కష్టాలు తీరాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తు న్నారు. ఇక్కడ వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య చొరవతో ప్రభుత్వం రూ.4 కోట్ల పంచాయతీరాజ్ నిధులను మంజూరు చేసింది. ఏడాది క్రితం ప్రారంభమైన వంతెన పనులు తాజాగా పూర్తయ్యాయి. త్వరలో వంతెనను ప్రారంభించనున్నామని పంచాయతీరాజ్ జేఈ అప్పలనాయుడు మంగళవారం తెలిపారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

గంట్యాడ: బాల్య వివాహాలు అనేక అనర్థాలకు దారితీస్తాయని ఐసీడీఎస్ పీఓ జోకుల ఉమాభారతి అన్నారు. 'బేటీ బచావో బేటీ పడావో' కార్యక్రమం లో భాగంగా పీఓ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో కళాజాత నిర్వహించారు. అంబేడ్కర్ కళాజాత బృందం సభ్యులు బాల్యవివాహాలతో కలిగే నష్టాలు, ఆడపిల్లలపై వివక్ష చూపరాదని, బాలల హక్కులు, తదితర అంశాలపై పాటల ద్వారా అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్లు ఎం. శ్రీలక్ష్మి, కె. సుభాషిణి, కె.పద్మ, వై.కృష్ణవేణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

16న దేశవ్యాప్త బంద్



మాట్లాడుతున్న కార్మికసంఘం నేతలు

శృంగవరపుకోట: సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక, ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు ఈనెల 16న నిర్వహించనున్న దేశ వ్యాప్త గ్రామీణ, పారిశ్రామిక బంద్‌ను ప్రజలంతా విజయవంతం చేయాలని ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేగల అప్పలరాజు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మద్దిక్రిష్ణ కోరారు. పట్టణంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతుల రుణాలను మాఫీచేయాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేయాలని, ఆహార భద్రత చట్టాన్ని పటిష్టపరచాలన్నారు. సీపీఐ మండల కార్యదర్శి ఎస్.కె.స్వామి, కార్మిక సంఘం నాయకులు మట్ట వీరభద్రరావు, వి.గోపి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

విజయనగరం అర్బన్: విద్యార్థి దశ నుంచి మానసిక ఉల్లాసానికి క్రీడలు కీలకంగా నిలుస్తాయని టూ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కోరాడ రామారావు అన్నారు. స్థానిక రింగ్‌రోడ్ శ్రీచైతన్య కళాశాల ప్రాంగణంలో మంగళవారం జరిగిన పాఠశాల క్రీడా వార్షికోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలిత విద్యార్థులు నిర్వహించిన మార్చ్ ఫాస్ట్ గౌరవవందన స్వీకరించారు. అనంతరం ఈ సందర్భంగా చేపట్టిన క్రీడా పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రాంతీయ పర్యవేక్షకులు వి.శ్రీనివాసరావు, పాఠశాల డీన్స్ సత్యనారాయణ, సాయికిషోర్, సూర్యచంద్ర, అప్పలనాయుడు, జోనల్ పీఈటీ పి.వాసు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం

- గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు
- 1,574 మందికి వైద్యపరీక్షలు
- జనరల్, నేత్రశస్త్ర చికిత్సలకు పలువురి ఎంపిక
- అవసరమైన వారికి ఉచితంగా మందుల పంపిణీ



జామి: ఆర్.బి.పురంలో వృద్ధులకు మందుల కిట్లు అందజేస్తున్న వైద్యాధికారి నాగశ్వేత, తదితరులు



గుర్ల: గరికివలసలో నేత్ర వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు,నాయకులు



చీపురుపల్లిరూరల్: ఇటకర్లపల్లిలో వృద్ధురాలికి మందుల కిట్ అందజేస్తున్న నాయకులు అనంతం, శ్రీనివాసనాయుడు



వేపాడ: సోంపురంలో వైద్యశిబిరాన్ని సందర్శిస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు



గజపతినగరం రూరల్: పురిటిపెంట సచివాలయం-2లో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ తవుడు

గుర్ల: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.వి.సూర్యనారాయణరాజు, పొట్నూరు సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని గరికివలసలో జగనన్న ఆరోగ్య సురక్ష-2వ విడతలో భాగంగా మంగళవారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని వారు సందర్శించారు. గుర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసరావు, సిబ్బంది శిబిరంలో 80 మందికి వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా జెడ్పీటీసీ, నాయకులు మాట్లాడుతూ ప్రజారోగ్యానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ద్వారా ప్రజలకు గ్రామాల్లోనే మెరుగైన వైద్యసేవలు అందుతున్నా యని చెప్పారు. ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో పేదలు వైద్యం చేయించుకునేందుకు ఇది వరకు ఉన్న రూ.5 లక్షల వ్యయపరిమితిని సీఎం జగన్ రూ.25 లక్షలకు పెంచారన్నారు. ఎంపీడీఓ వెంకటరమణ, నాయకులు బెల్లాన బంగారునాయుడు, బెల్లాన జగన్నాథం, కేసలి అప్పలనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే వైద్యం

గజపతినగరం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలతో గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వం ఇంటివద్దే మెరుగైన వైద్యసేవలందిస్తోంద ని జెడ్పీటీసీ గార తవుడు అ న్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష-2లో భాగంగా మండలంలోని పురిటిపెంటగ్రామ సచివాలయం-1 ఆవరణలో మంగళవారం నిర్వ హించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. మరు పల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు అనూజ్‌కుమార్, శిరీష ఆధ్వర్యంలో 429 మందికి వైద్య సిబ్బంది వివిధ వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. స్థానిక సర్పంచ్ విజయలక్ష్మి, మాజీ సర్పంచ్ మండల సురేష్, నాయకులు బెల్లాన త్రినాథ రావు, గోవిందరావు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం

చీపురుపల్లిరూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయు డు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష-2లో భాగంగా మండలంలోని ఇటకర్లపల్లిలో గరివిడి మండలం కోనూరు పీహెచ్‌సీ వైద్యా ధికారి చింతాడ వెంకటరమణమ్మ ఆధ్వర్యంలో మంగళవా రం నిర్వహించిన వైద్య శిబిరాన్ని వారు సందర్శించారు. శిబిరంలో ఇటకర్లపల్లి,పోతాయవలస, పి.ఎస్.లక్ష్మీపురం గ్రామాలకు చెందిన 376 మందికి వైద్యసిబ్బంది సేవలందించారు. సర్పం చ్ మీసాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సోంపురంలో...

వేపాడ: జగనన్న ఆరోగ్య సురక్ష- 2 విడతలో భాగంగా సోంపురంలో బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.శివాని ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వ హించారు. శిబిరంలో 457 మంది చిన్నపిల్లలు, పెద్దలకు వైద్యులు శివాని, బి.సత్య శ్రీనివాస్, బి.మౌనిక, ఈశ్వరరావు సాధారణ, నేత్ర వైద్యపరీక్షలు చేశారు. నేత్ర, సాధారణ శస్త్రచికిత్సలకు అయిదుగురిని ఎంపికచేసి, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. సర్పంచ్ మురిపిండి గంగరాజు, ఎంపీటీసీ ఏ.సత్యనారాయణ, మండల వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు ఉగ్గిన శ్రీనివాసరావు శిబిరాన్ని సందర్శించారు. బొద్దాం పీహెచ్‌సీ హెచ్ఎస్ పి.ఎస్.ఎన్.మూర్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్.బి.పురంలో..

జామి: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా ఆర్.బి.పురంలో జామి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.నాగశ్వేత ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 232 మందికి వైద్యులు నాగశ్వేత, ఏ.వి.ఎస్.ఉషారాణి బి.ఎస్.వి.ప్రసాద్ వివిధ వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.అనిల్‌ప్రేమ్‌కుమార్, సచివాలయ కార్యదర్శి బోని సన్యాసినాయుడు, సీహెచ్‌ఓ ఫ్లోరెన్స్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత



ప్రజలకు చెత్తసేకరణ బుట్టలు పంపిణీ చేస్తున్న నాయకులు

గుర్ల: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కె.వి.సూర్య నారాయణరాజు, పొట్నూరు సన్యాసినాయుడు అన్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన చెత్త సేకరణ బుట్టలను మండలంలోని కెల్ల గ్రామం లో మంగళవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చెత్తను కాలువల్లో, వీధుల్లో పార బోయకుండా బుట్టల్లో వేసి ఇళ్ల వద్దకు వచ్చే క్లాప్ మిత్రలకు అందజేయాలని గ్రామస్తులకు సూచించారు. క్లాప్ మిత్రలకు పంచాయతీ నిధులతో కొనుగోలు చేసిన చెత్తసేకరణ రిక్షాలను అందజేశారు. వైస్ సర్పంచ్ కొంచాడ ఈశ్వరరావు, నాయకులు కెల్ల వెంకటరమణ, కెల్ల సూర్యనారాయణ, కెల్ల సురేష్, పైడిరాజు పాల్గొన్నారు.

సీతంలో ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం



సరోజినీనాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు తదితరులు

విజయనగరం అర్బన్: పట్టణంలోని గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. తొలిత కళాశాల ప్రాంగణంలో స్వాతంత్ర్య సమరయోధురాలు సరోజినీనాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు మాట్లాడుతూ మహిళల అభివృద్ధి కోసం భారతీయ సమాజంలో ఉన్న దురాచారాలకు వ్యతిరేకంగా ఆమె పోషించిన పాత్ర కీలకమని అన్నారు. మహిళలందరూ సరోజినీ నాయుడు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని మీరంతా వృద్ధిలోకి రావాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీఏ నాయుడు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్తాచాటిన సెంచూరియన్ విద్యార్థులు



శ్రీనివాస పండా



తనీష్ పాత్రో



రాహుల్ గౌడో



అట్టాల జాహ్నవి



సమాంతర్ మైత్రా

పర్లాకిమిడి: జాయింట్ ఇంజినీరింగ్ ఎంట్రన్స్-2024 మెయిన్స్ ఫలితాల్లో సెంచూరియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఎనిమిది మంది ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ సునీతా పాణిగ్రాహి తెలియజేశారు. మంగళవారం ప్రకటించిన ఫలితాల్లో ప్లస్ టూ విద్యార్థులు శ్రీనివాస పండా 96.4 శాతం సాధించగా, తనీషా పాత్రో 92.5 శాతం, రాహుల్ గౌడో 92.2 శాతం, సమాంతర్ మైత్రా 87.5 శాతం, అట్టాల జాహ్నవి 85.4 శాతం , కె.రాజేంద్ర 78.9 శాతం సాధించారు. వీరిలో శ్రీనివాస పండా సెంచూరియన్ పబ్లిక్ స్కూల్ అధ్యాపకుడు రబినారాయణ పండా కుమారుడు. విద్యార్థులకు వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.ఎస్.రావు, ప్రిన్సిపాల్ సునీతా పాణిగ్రాహి, ప్రాంతీయ సంచాలకులు సంబిత్ పాత్రో తదితరులు అభినందనలు తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

గజపతినగరం: మండలంలోని లింగాలవలస గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సత్యనారాయణ అనే వ్యక్తిని పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి 12మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని స్థానిక ఎస్ఐ యు.మహేష్ తెలిపారు.

విధుల్లో చేరిన న్యూరోసర్జన్, న్యూరో ఫిజిషియన్లు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మంగళవారం న్యూరో సర్జన్, న్యూరో ఫిజిషియన్లు విధుల్లో చేరారు. ఈ మేరకు వారు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌కు జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చారు. జనరల్ సర్జన్‌గా డాక్టర్ రెడ్డి శంకరరావు (అసిస్టెంట్ ప్రొఫెసర్), న్యూరో ఫిజిషియన్లుగా డాక్టర్ ఎస్.వెంకటేష్ (అసిస్టెంట్ ప్రొఫెసర్), కల్లూరి చిన్నారావు (అసిస్టెంట్ ప్రొఫెసర్) విధుల్లో చేరారు..

నేడు పైడితల్లి అమ్మవారి విగ్రహ పతిష్ఠ



పైడితల్లి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు దంపతులు

భోగాపురం: మండలంలోని పోలిపల్లి గ్రామంలో కొలువైన పైడితల్లి అమ్మవారి ఆలయాన్ని రూ.40 లక్షలు దేవదాయ శాఖ నిధులతో పాటు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు విరాళంగా అందజేసిన రూ.10 లక్షలు మొత్తం కలిపి రూ.50 లక్షల నిధులతో పునర్నిర్మించిన ఆలయంలో బుధవారం అమ్మవారి విగ్రహ పతిష్ఠ కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అప్పలనాయుడు మంగళవారం సతీసమేతంగా అమ్మవారిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించారు. అర్చకులు మల్లిబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈఓ వై.శ్రీనివాసరావు, ఆలయ కమిటీ చైర్మన్ కర్రోతు పైడిరాజు, సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, పతివాడ రామకృష్ణ, కర్రోతు బంగార్రాజు, తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

- రైల్వే డీఎస్పీ హెచ్చరిక

బొబ్బిలి: రానున్న ఎన్నికల సందర్భంగా రైళ్ల ద్వారా అక్రమంగా మద్యం, నగదు, మత్తు పదార్థాలను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని రైల్వే విశాఖ డీఎస్పీ బి.మోహనరావు హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక రైల్వే ఔట్‌పోస్టును సందర్శించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు తనిఖీలు క్షుణ్ణంగా చేపట్టాలని ఆదేశించారు. లైన్స్ సీఐ కె.వెంకటరావు, వి.రవివర్మ, స్థానిక సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం పనిచేస్తేనే గరిష్ట వేతనం



జామి: కుమరాంలో ఉపాధి పనుల వద్ద నీడ కోసం ఏర్పాటు చేసిన టెంట్లను పరిశీలిస్తున్న పీడీ ఉమాపరమేశ్వరి

జామి: ఉపాధి హామీ వేతనదారులు నిబంధనల ప్రకారం పనులు చేస్తేనే ప్రభుత్వం నిర్దేశించిన రోజువారీ గరిష్ఠ వేతనం రూ.272 అందుతుందని డ్వామా పీడీ జి.ఉమాపరమేశ్వరి అన్నారు. కుమరాం గ్రామం లో మంగళవారం చేపట్టిన ఉపాధి పనులను ఆమె పరిశీలించారు. వేతనదారుల మస్టర్ల సీట్లను తనిచేశారు. పని ప్రదేశంలో తాగునీరు, మెడికల్ కిట్లు, నీడకోసం టెంట్లు అందుబాటులో ఉంచాలని ఉపాధి అధికారులకు సూచించారు. పీడీ వెంట ఉపాధి హామీ ఏపీఓ కిరణ్మయి, ఇంజినీర్ కన్సల్టెంట్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

రెండు పూటలా పనులకు హాజరు కావాలి

బొండపల్లి: రెండు పూటలా ఉపాధి పనులు చేయాలని ఎంపీడీఓ ఎస్.హరిహరరావు వేతనదారులకు సూచించారు. మండలంలోని బి.రాజేరు గ్రామంలోని నాగరాజు చెరువులో చేపడుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన వేతనదారులతో మాట్లాడుతూ ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పనులు చేయాలని చెప్పారు. పని ప్రదేశంలో టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లను అందుబాటు లో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు.



బొండపల్లి: బి.రాజేరులో వేతనదారులకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ హరిహరరావు

రూ.11.50 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణం



పెదపూతికవలసలో పాఠశాల నుంచి రామాలయం వరకు నిర్మిస్తున్న సీసీ రోడ్డు

మెరకముడిదాం: మండలంలోని పెదపూతికవలస గ్రామంలో సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణం జోరుగా సాగుతోంది. ఇజ్జిరోతు వీధి, చౌడవాడ వీధి, వల్లూరు వీధి, రామాలయం వీధితో పా టు మరికొన్ని వీధుల్లో జిల్లాపరిషత్ నిధులు రూ.10 లక్షలు, పంచాయతీ నిధులు రూ.1.50 లక్షలతో ఏడు సీసీ రోడ్లు, కాలువలను నిర్మిస్తున్నారు. సర్పంచ్ మజ్జి అన్నపూర్ణమ్మ, ఆమె కుమా రుడు వైఎస్సార్‌సీపీ నాయకుడు మజ్జి శ్రీనివాసరావు పర్యవేక్షణలో రెండు రోజులుగా ఈ పనులు సాగుతున్నాయి. సీసీ రోడ్లు, కాలువలు నిర్మిస్తుండడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్ల నిర్మాణాల వేగవంతానికి చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ చలంనాయుడు

బొండపల్లి: మండలంలోని అన్ని జగనన్న లేఅవుట్లతో పాటు, సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణాల వేగవంతానికి సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చల్లా చలంనాయుడు సూచించారు. మండలంలోని 17 సచివాలయాల ఇంజినీరింగ్ సహాయకులతో ఇళ్ల నిర్మాణా లపై స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలానికి 2,076 ఇళ్లు మంజూరు కాగా వాటిలో 1,256 నిర్మాణాలు పూర్తయ్యాయని, లబ్ధిదారులు గృహ ప్రవేశం కూడా చేశారన్నారు. మిగతా ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని, వాటన్నింటినీ లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసేలా చూడాలని చెప్పారు. ఎంపీడీఓ ఎస్.హరిహరరావు, హౌసింగ్ జేఈఈ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు సిబ్బంది మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎంపీపీ పీరుబండి హైమావతి సూచించారు. మండలంలోని పెదమజ్జిపాలెం పీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ (హెచ్‌డీఎస్) సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందని చెప్పారు. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేట్ హాస్పిటళ్లకు దీటుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. రోగులతో ఓపిగ్గా మాట్లాడుతూ వారికి వైద్యసేవలు అందించాలని చెప్పారు. ఆస్పత్రి మరింత అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, వైద్యాధికారి డాక్టర్ పల్లవి, పి.ఎం.పాలెం సర్పంచ్ కొంచాడ సన్యాసినాయుడు, రామభద్రపురం సర్పంచ్ కర్రి ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణపై అవగాహన



కొత్తపేటలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖ సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామంలో అడవుల సంరక్షణపై అటవీ శాఖ సిబ్బంది మంగళవారం అవగాహన కల్పించారు. స్థానిక ఫారెస్ట్ బీట్ అధికారి రామా రావు మాట్లాడుతూ అడవుల సంరక్షణకు ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా కృషి చేయాలన్నారు. అడవుల సమీపంలో నిప్పును ఉపయోగించరాదన్నారు. అడవుల్లో ఉన్న వనరులను సొంతానికి వినియోగిస్తే అటవీ శాఖ చట్టం ప్రకారం చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.